

అదో ఊరు, భూలోకంలోనే.

ఆ ఊరికి పైనున్న ఆకాశంలో వరుణదేవుడి కరువుకోసం అమెరికానుండి దిగుమతి అవుతున్న పాలు గంయిదు తెల్లని మబ్బుపింజలు. ఆ మబ్బుల్లో పడుకోవాలని ఆరాటపడుతున్న రెండు గద్దలు.

ఆ ఊరికి ఉత్తరాన హిమాలయాలంత పెద్ద కొండలు కాకపోయినా, కుతోద్యానవాళ్ళవి కృత్రిమ పర్వతాలకన్నా చాలా పెద్ద రాతికొండలు. ఆ గుట్టలమీద ఎక్కడా ఒక్క చెట్టు, ఆకు కనిపించదు.

దక్షిణాన హిందూమహాసముద్రం అంతటిది కాకున్నా స్విమ్మింగ్‌పూల్ మాత్రం కాని ఒక చిన్న చెరువు నీటికోసమేమో, కొటికన్నులతో మింటివేపు ఎదురు చూస్తోంది.

తూర్పున ప్రతిరోజూ ఉదయాన మాత్రం అరుణ భాస్కరుడు భారతీయ క్రమశిక్షణ ప్రకారంగాక, కాస్త సరియైన సమయానికే ఉదయించటంతప్ప వేరే గొప్ప విశేషమేమీ లేదు.

ఇక పడమరన ఎండిపోయిన తుప్పలు, బండరాళ్ళు, మాడినతీగలు, మోడువారిన మానులు బిచ్చగాళ్ళుగా, నిరుద్యోగ సార్వభౌములుగా, భగ్నప్రేమికులుగా, నిప్పుల మూట, పంటలలేమి భరించలేక అధిక సంతానంతో అలమటిస్తూ అజ్ఞాన తిమిరంలో కొట్టుమిట్టాడుతున్న జీవచ్ఛవాల్లాంటి రైతులుగా [illegible] ఎప్పుడో

దానికి ఓట్లు వెయ్యమని అర్థిస్తున్న అభ్యర్థుల్లా ఉన్నాయి.

ఓ చిన్న బంగళా, మూడు నాలుగు తెల్లని డాబా ఇళ్ళు, దాదాపు మూరు పెంకుటిళ్ళు, మూటికిమించి తాడికమ్మలు, ఆకులు, గడ్డి కప్పిన గుడిసెలు, అన్నింటినీ మించి వేదువేపచెట్లు, చిన్నపోయిన చింతచెట్లు. ఇవన్నీ శంకరాభరణంలాకాక వీరావేశంతో ఎగిరేవాడి జడలు కట్టిన తలలా గజిబిజిగా ఉన్నాయి. ఈ గజిబిజి తలకు సమీపంలోనే తైలసంస్కారంలేని మరో చిన్న చిప్పిరి తల ఉంది. దీనిలో అన్నీ పూరిగుడిసెలు, చెట్లు.

మబ్బుల్లో ఉన్న ఒక గద్ద రయ్యిమంటూ వచ్చి ఈ పూరిగుడిసెలమీద తిరుగుతున్న రాబందులు, గద్దల్లో కలిసింది. ఎగిరే రాబందుల సందోహాన్ని చీల్చి కింద నేలమీదచూస్తే అక్కడో కొన్ని మానవాకారంలో ఉన్న జీవాలు. వారిమధ్యన ఓ నెత్తురుముద్ద. వాళ్ళు కుట్టుపక్కలా ఎముకలతో ఆడుకొంటున్న దిగంబరు శైశవ భావిభారతపౌరులు!

"ఏందిర, దుర్గా, నా పిలుపు ఓ వప్పత్తది" అన్న దో కంఠం.

భూలోకంలో ఉన్న ఆ ఊరు ఆంధ్రదేశంలో ఉందని అప్పష్టంగా తెలియజేసిం దా గొంతు. అది తెలుగేనా అని ఆంధ్ర నాగరికులు, అక్షరాస్యులు ఆశ్చర్యపడవచ్చు. కాని మన తెలుగుభాషే వాళ్ళ జీవితాలకుమల్లే వికృతంగా మారిపోయింది.

చెట్టుమీది మాలకాకి ఒకటి మాంసంముక్క ముక్కున కరుచుకొని ఎగిరింది. మాలపల్లెను దాటి పెంకుటిళ్ళమీదుగా వెళ్ళి ఒక డాబాయింటి వెనక బావిమీద చేరింది. అప్పటికప్పుడే రెండు మూడు కాకులు చేరాయి. పాతచీరలో పాతపోసిన పసిడిబొమ్మ కాకివేపుచూస్తూ ఏదో మాట్లాడుతూంది. కాకి గోలలో ఆమె మాటలేవీ వినరాలేదు.

"ఆఁ! మన సంసారానికి ఒక్క చుట్టాలే తక్కువ. కొట్టవే, లక్ష్మి, కొట్టు. పాడుకాకులు" అంటూ గరిటె చేతో పట్టుకొని బయటికి వచ్చింది పిప్పళ్ళబస్తాలాంటి స్త్రీ.

మహాకాయ కంఠానికి అదిరి చెదిరిపోయాయి కాకులు మాంసంముక్కతోసహా.

"కాంతమ్మగారూ, ఇవ్వాళ మన అమ్మాయిని చూట్టానికి వస్తామని చెప్పమన్నారు." ఒగురుస్తూ వచ్చాడు తళతళా మెరిసే గుండు, గుండుమీద నాలు గయిదు పోచల పీచులాంటి జుట్టు.

"ఏ ఊరినుంచి, శాస్త్రులూ?" అడిగిందికాంతమ్మ.

"అదే, లక్ష్మీపురంవాళ్ళండీ." పోకచెక్కకామాలు శాస్త్రి నోటిలో పటపటమన్నది.

"వచ్చేవాళ్ళు పొద్దున్నైనా వస్తే సరిపోయేది. సాయంకాలం వస్తారా?" అని అడిగింది కాంతమ్మ.

"ఈవాళ ఉదయమే లక్ష్మీపురం వెళ్ళానండి చిన్న పనిమీద. అయితే అక్కడ ఆ దొరవారు కలిసి చెప్పారు. మధ్యాహ్నంవరకు వర్జ్యం ఉంది కాబట్టి సాయంకాలం వస్తామన్నారు. ఈవాళ మంచిరోజు. అయినా అంతగా మనం చెయ్యవలసిన పనిఅంటూ ఏముంటుందండి, ఏదో అమ్మాయిని కాస్త అలంకరించటంతప్ప" అని లక్ష్మికేసి చూసి నవ్వాడు శాస్త్రి.

**మంచికి పేరున్నది. చెడ్డకి పేరున్నది. వంశ ప్రతిష్ఠ నిలబెట్ట డానికి ఒకడు పుడితే, వంశ మర్యాద మంట గలపడానికి మరొకడు అవత రిస్తాడు. దానికి, దీనికి ఆధారం, ఆలంబన కామినీ, కాంచనాలే...**

లక్ష్మి దానిమ్మమొగ్గలా సిగ్గుతో ఎఱ్ఱబారి ముడుచుకుపోయింది.

"దొరవారు ఇంట్లో లేనట్టున్నారు" అన్నాడు శాస్త్రి.

"దొరవారికేం పని? అన్నం తిని అవతల పడితే అయిపోయె! మళ్ళీ రాత్రి అయితేగాని ఇల్లు గుర్తురాదు" అని మూతి విరుచుకొంటూ ఇంట్లోకి నడిచింది కాంతమ్మ.

"మీరు వచ్చేముందు బావిమీద కాకులు అరిచాయి, శాస్త్రిగారూ. నేను చుట్టాలు వస్తారని అన్నాను అమ్మతో" అన్నది లక్ష్మి.

"రామరామ. మరి నాలాంటి పెనకటి పెద్ద మనుష్యులు చెప్పిన మాట పొల్లుపోతుందా, అమ్మాయి, ఏదో ఈనాటి కుర్రకారుకు నచ్చవుగాని" అని ఇంట్లోకి వెళ్ళాడు శాస్త్రి.

కాస్సేపటికి ఇంటి ముందువాకిలిలోకి వచ్చాడు శాస్త్రి. ముఖద్వారంలోంచి అప్పుడే తెల్లగుడ్డలతో

## రాజేంద్ర

బట్టతలమనిషి ప్రవేశించాడు. కురచగా, బక్కపలచగా ఉన్నాడు.

"దొరవారూ" అంటూ చేతులు సగం ఎత్తాడు శాస్త్రి.

"నమస్కారం, అయ్యగారూ" అన్నాడు దొర.

"నమస్కారం" అన్నాడు అప్పుడు శాస్త్రి.

కాంతమ్మ భారతదేశ జనాభా అయితే, దొర మన *దేశంలోని పాడిపంటలను గుర్తుకు తీసుకువస్తాడు.* అప్పులు, అవినీతి, లంచగొండితనంలాంటి ఆకారం కాంతమ్మది. నలిగిపోతున్న ధర్మం, నీతి, దాతృత్వాలకు ప్రతిబింబం దొర శరీరం.

శాస్త్రి విన్నవించిన సంగతి అంతా విని, "దొరసానితో చెప్పావుగా. అంతేచాలు. నువ్వుమాత్రం ఒకటి రెండు గంటలకు రా, విన్నావా" అన్నాడు దొర.

"ఊఁ!" తల ఊపాడు శాస్త్రి.

మళ్ళీ "మరిచిపోకు మరి, విన్నావా" అన్నాడు దొర ఇంట్లోకి వెళ్ళిపోతూ.

"రామరామ, నేనెలా మరిచి ఉండగలనండి. గంట ఏమిటి అర్ధగంటలో వస్తాను" అన్నాడు శాస్త్రి రిస్టు వాచీకేసి చూస్తూ.

శాస్త్రి ముఖద్వారం సమీపించాడు. అంతలోనే ఎడమవేపు గోడమీదినుండి దభాలున నల్లపిల్లి, నోట్లో ఎలకపిల్లతో దూకింది.

"పాడుపిల్లి" అంటూ ఎడమవేపే దారి కడ్డంగా రాకుండా ఉండాలని కాబోలు చేతితో అదిలించాడు.

అది శాస్త్రిముందునుండే వెళ్ళి కుడివేపు గోడ ఎక్కి వెనక్కి చూసింది. శాస్త్రి తెరిచిన నోరుతో, విప్పారిన కళ్ళతో విస్తుపోయి మళ్ళీ అదిలించాడు, "అవతలకు పక్షి" అంటూ.

పిల్లి గోడ దూకి పక్కనున్న పెంకుటింటిమీద పడింది. పెంకులమీద కాస్సేపు నడిచి కిందికి దుమికి చిందరవందరగా పడిఉన్న కర్రలకింద దూరింది.

అటువక్కన పందిరిగుంజవద్ద గడ్డపారతో త్రవ్వుతున్న, నెరిసిన వెంట్రుకలు, కొప్పి ఊడిన పళ్ళు, కావి రంగు పంచలో ఉన్న నడివయస్సు వ్యక్తి "పిడికి కొలువు దొరుకదు, పోతేమానె ఇక్కడ పనిచెయ్యమంటే నాతకాదు" అని గొణుక్కుంటున్నాడు.

ద్వారంలోనుండి ఒక్కసారే వచ్చిన యువకుడు, "నాన్నా, నువ్వు రోజూ ఇలా అంటే నాకేం ఈ ఇంట్లో ఉండ బుద్ధి కావటంలేదు. నేను ఉద్యోగంకోసం ఆలోచించని క్షణం, ప్రయత్నించని రోజంటూ ఉండటంలేదు. ఆ పాడు బి. ఏ. చదవకున్నా బాగుండేది. మిమ్మల్నేదో ఆశ పెట్టినట్లే అయింది. మీ కంత భారంగా ఉంటే ఇల్లు విడిచి వెళతాను, ఉద్యోగంకోసం తిరుగుతాను. దొరక్కపోతే చస్తాను" అన్నాడు. కంఠం బొంగురుపోయింది.

"సత్యం, ఇంతగా బాధపడతావని అనుకోలేదురా. ఇంకెప్పుడూ విన్నేమీ అనను. కాని చస్తానని నీవూ అనద్దు" అంటూ గడ్డపార కింద పారేసి అమాంతం వచ్చి కొడుకును గట్టిగా అదుముకొన్నాడు. మనిషి నిలువెల్లా వణికిపోతున్నాడు. వణుకుతున్న మట్టిచేతోనే కన్నీరు తుడుచుకొన్నాడు.

ఇదంతా ద్వారంలో నిల్చొని చిరిగిన చీరతో, లోతుకుపోయిన చెక్కిళ్ళతో, పీక్కుపోయిన కళ్ళతో మూర్తీభవించిన మాతృదేవత.

"అమ్మా, లోపలికి పద" అని తానూ లోపికి వెళ్ళాడు సత్యం.

చేతిలోకి తీసుకొన్న గడ్డపార కాస్సేపేదో ఆలోచించి మళ్ళీ కిందికి విసిరాడు. బండకు తాకి గుణపం ధ్వని చేసింది.

గోడచూరుమీదికి అమాంతం దూకింది పిల్లి, సగం అప్పటికే అయిపోయిన ఎలకతో. చూరుమీద కొద్దిదూరంవెళ్ళి వీధిలో దూకింది. గోడవారగా ఉన్న మురికిగుంటలో పొర్లుతున్న పంది దిగ్గున లేచి బయటికి వచ్చి ఒళ్ళు విదిలించింది.

"ఛీ! ఛీ! పాడుపంది. పాంటుఅంతా పాడై పోయిందిరా" అన్నాడు, నల్ల బుష్‌షర్టు, తెల్లపాంటు వేసుకొన్న యువకుడు.

"అరెరే! నామీదకూడా కొంచెం పడిందిరా శివం" అన్నాడు వేస్తగాడు.

"చూస్తావేంరా, మందరం, బండదీసి బాదక" అంటూ ఓ రాయి తీసి విసిరాడు శివం.

దెబ్బ తాకలేదుగాని పంది పారిపోయింది.

"గుడ్డలు మార్చుకొని క్లబ్బుకు వస్తానుగాని, నువ్వూ మార్చుకొని వచ్చేప్పుడు సత్యాన్ని తీసుకురా" అంటూ వెనక్కి తిరిగాడు శివం.

మందరం పక్కవీధిలో వడ్డాడు.

ఎండిపోయిన బురదతో పంది వచ్చి మళ్ళీ మురికి గుంటలోనే మునిగింది.

నెవులూ, తోకా కత్తిరించిన కుక్క ఒకటి వచ్చి ఆ

కొంటారా? నిన్నే ప్రెసిడెంటుగా ఉండమంటే నువ్వు. నేనే గనక ప్రెసిడెంట్‌గా ఉంటేనా, నా సామిరంగ పిళ్ళ భరతం పట్టే వాణ్ణి" అన్నాడు శివం ఊగిపోతూ.

"మొన్నటిదాకా అప్పో సప్పో చేసి కాలేజీ చదువంతా ఎంతో కష్టపడి చదివించాడు గదరా నాన్న. ఇప్పుడు ఏదైనా ఓ ఉద్యోగం చెయ్యక క్లబ్బు ప్రెసిడెంటు అయి ఊరేగుతే వచ్చే లాభమేమిటి చెప్పండిరా? ముత్యాలరావు రికమెండ్‌చేస్తే మన జిల్లా పరిషత్తు ఆఫీసులోనో, తహసీలు ఆఫీసులోనో ఎల్. డి. సి. ఉద్యోగం దొరికేది. కాని నాకే అడగటానికి మనసొప్పటంలేదు. నాన్నేమో మొన్న వెళ్ళి ప్రాధేయపడ్డాట్ట నాకో ఉద్యోగం ఇప్పించమని. నన్నొకసారి కలవమని చెప్పాట్ట ముత్యాలరావు. కాని నేనే వెళ్ళలేదు. నాన్న రోజూ ఏదో గొణుగుతూనే ఉన్నాడు. నాకేం చెయ్యాలో తోచటంలేదు" అని ఆగాడు సత్యం.

శివం, సుందరం ఏమీ మాట్లాడలేదు. ముక్కాలు కలిపాడు సుందరం. శివం పేపరు చేతిలోకి తీసుకొని పైకి చదివాడు, "శుభాంజలి గీతాబాబు నవ్వులో పడ్డ గువ్వ, ముసలిమువ్వ అయినా రంగు వేసుకొన్న రవ్వ" అని.

"ఏడి భాష పాడుకాను, ఏం రాస్తాడురా" అని పేపరు చూసి, "కింద చూడు ఇంకేం ఉన్నదో, గీతాబాబు లాంటి యువకులపాలిటి ఎర్రగా కాల్చిన ఇనపమువ్వ" అన్నాడు సుందరం.

ముగ్గురూ బిగ్గరగా నవ్వారు.

"మీ ఇద్దరిలో ఎవరైనా ప్రెసిడెంటుగా నిలబడితే?" సత్యం అడిగాడు.

"మేమా? నేనా ధనవంతుణ్ణి కాను. పోనీ, తెలివైనా ఉండాలంటే ఈ ఏడు నాలుగోసారి మెట్రిక్ పరీక్షకి కూర్చుండాలనుకొంటున్నాను" అన్నాడు తీవ్రంగా శివం.

"నువ్వు బోర్న్ కోక రాజపోషకుడివిరా" అని నవ్వాడు సుందరం.

"ఇదిమాత్రం పిటజోకు!" అన్నాడు శివం.

సత్యం సుందరంకేసి చూశాడు.

"ధనవంతులతో మనమేం పోటీచెయ్యగలంరా! అందులో వీడితో కయ్యం పెట్టుకొంటే కొరివితో తల గోక్కున్నట్లే అవుతుంది" అన్నాడు సుందరం.

"ధనవంతులతో పోటీ, కొరివితలా అంటున్నారేమిటి సంగతి?" అంటూ శాస్త్రి ప్రవేశించాడు.

"ఏదైనా ఒక పని చెయ్యాలంటే డబ్బు ప్రధానం కదా, శాస్త్రిగారూ?" అన్నాడు శివం.

"రామ రామ. పూర్వీకులు ఒట్టినే అన్నారుటండీ 'ధనమూలం ఇదం జగత్' అని" అన్నాడు శాస్త్రి జంధ్యం వేలికి చుట్టుకొంటూ.

"కరెక్ట్ శాస్త్రులూ, కరెక్ట్. మీది జీనియస్ బ్రెయిన్ నిజంగా" అన్నాడు సుందరం.

"ఆ తిట్టేదేదో తెలుగులో తిడితే ఎంత బాగుంటుంది చెప్పండి! విని సంతోషించేవాణ్ణి కదా" అంటూ ఎర్రపంచతో బండమీద దుమ్ము దులిపి కూచున్నాడు శాస్త్రి.

ముగ్గురూ నోరు తెరిచారు.

కాసేపటికి సత్యం అన్నాడు, "జీనియస్ అంటే 'ప్రతిభాశాలి' అని అర్థమండీ, శాస్త్రిగారూ" అని.

శాస్త్రి ఏమీ మాట్లాడలేదుకాని గుడ్లు తేలుకు పోతున్న చాకలిదాన్ని ముభావంగా చూస్తూ ఉండిపోయాడు.

పడమరవీధినుండి గేదెల గుంపొకటి దుమ్ము రేపుతూ ఊళ్ళోకి వెళ్ళింది. ముక్కులు మూసుకున్నారు అందరూ, ఒక్క శాస్త్రి తప్ప.

"ఏం శాస్త్రిగారూ, మీరు ఆరోగ్యసూత్రాలు పాటించరా?" అడిగాడు శివం.

"గోధూళి మంచిదిగాదుటండీ."

"గోధూళి అంటే గేదెలు రేపిన దుమ్మైనా, శాస్త్రులూ?" అన్నాడు సుందరం.

శాస్త్రి సుందరంకేసి చురచురా చూశాడు. సత్యం కళ్ళతోనే ఏదో చెప్పాడు సుందరానికి.

"ఇదెక్కడిదండీ, పరమఛండాలంగా ఉంది పత్రిక" అన్నాడు శాస్త్రి.

"ఆఁ! అది మీరు చదవవలసిన పేపరు కాదండీ, మీలాంటి సద్బ్రాహ్మణులు చెడిపోతారు" అని సుందరం చెయ్యి చాచాడు.

"అక్షరాలే కనిపించటంలేదు చదువుదామన్నా. తీసుకోండి" అంటూ ఇచ్చాడు పేపరు.

బంగారురంగులో మర్రిచెట్టు, చెట్టుకింది మనుష్యులు చూడముచ్చటగా ఉన్నారు. పడమరన మోడువారిన చెట్టుచాటున వృద్ధభానుడు అస్తమిస్తున్నాడు.

దాదాపు నలభై ఏళ్ళున్న స్త్రీ వచ్చి "అయ్యగారూ, మా కోడలు పెద్దదయింది. ఈయాల మంచిరోజేనా?" అని అడిగింది.

మీనమేషాలు లెక్కపెట్టి, "చాలా మంచిరోజు. వెళ్ళు కాని మల్లీ, మొన్నమొన్నటిదాకా గదుటే. ఇంత తొందరగా. . ." గారపట్టిన పళ్ళన్నీ ఇకిలపెట్టి నవ్వాడు శాస్త్రి.

"పదకొండు ఎళ్ళువచ్చు మొన్నటి పున్నానికి. అయ్యగారూ" అన్నది వేళులు మలుపుకొంటూ మల్లి.

"హాఁ! కాలమహిమ, శాస్త్రులూ" అన్నాడు సుందరం.

సత్యం చిన్నగా, శివం గొల్లునా నవ్వారు.

"మల్లీ, అనుమానమేం లేదు, వెళ్ళు" అన్నాడు శాస్త్రి. మల్లి వెళ్ళిపోయింది.

చిటికెడు ముక్కుపొడుం పీల్చి తనలో తానే అనుకొన్నాడు శాస్త్రి, 'ఇంకెప్పుడు వస్తారు? చీకటి పడింది, ఇంక రారేమో?' అని.

"ఏమిటి, శాస్త్రులూ, నీకు నీవే మాట్లాడు కొంటున్నావు?" అడిగాడు సుందరం పేకముక్క విసురుతూ. సత్యం ఏమిటన్నట్లు చూశాడు శాస్త్రి కేసి.

"వసంతరావు దొరగారింటికి అమ్మాయిని చూడటానికి వస్తామన్నారండి లక్ష్మీపురంనుండి. చీకటి పడింది. ఇప్పుడేం వస్తారు?" అన్నాడు శాస్త్రి.

"ఆఁ! మొన్న నేను వరంగల్ వెళ్ళిననాడు వసంతరావు, ముత్యాలరావు మాట అనుకొన్నారుట గద. ఏమయిందేమిటి?" అడిగాడు శివం.

సుందరం ఏదో చెప్పబోయాడు.

కాని శాస్త్రి "ఆఁ! ఏముందండి వాళ్ళిద్దరిమధ్య ఎన్నాళ్ళనుండో జరుగుతున్న కథేనాయె. అది ఈ నాటిదా, ఓహో" అన్నాడు.

"అసలు ఇంత పగ ఎందుకు, శాస్త్రిగారూ, వీళ్ళిద్దరి మధ్యా? ఒక్క వంశం ఒక్క కథ" అన్నాడు శివం.

"అందుకే గదరా దాన్ని పాలి పగ అన్నది" అన్నాడు సుందరం.

"వీళ్ళ కథ నాకు పూర్తిగా తెలియదు. ఏదీ చెప్పండి, శాస్త్రిగారూ" అని అడిగాడు సత్యం.

"ఏముందండి. ఈ ముత్యాలరావు తండ్రి తిరుపతిరావుకు, వసంతరావు తండ్రి కొండాలరావుకు ఎప్పుడూ పడేదికాదు. పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేది. ఇద్దరూ ఒక్క తండ్రి కొడుకులయినా తల్లులు వేరు. తిరుపతిరావు, కొండాలరావుల తండ్రి కిషన్‌రావు అని, ఓహో! రాజా మాదిరిగా అట్టహాసంగా బతికేవాడటలెండి. ఆయనలో మాత్రం ఏ ఒక్క పాడుగుణమూ లేకపొయ్యేది అని అంటారు. తిరుపతిరావు అచ్చం తండ్రిపోలికే. ఆయన భారివిగ్రహం. ఈ ముత్యాలరావు ఆయనలో సగం ఉండడు. కొండాలరావుది అంత భారీశరీరం కాదు. కాని మహా దుర్మార్గుడుగా ఉండేవాడండి. అదే కొడుకు వసంతరావులో మచ్చుకైనా కనిపించవు ఆ గుణాలు. తరానికొక్కడు తేలుతాడని మన పూర్వీకులన్నట్లు ఆ తరంలో కొండాలరావు దుర్మార్గుడయితే ఈ తరానికి ముత్యాలరావు తేలాడు. భాగపంపకాలలో ఇద్దరన్నదమ్ములు మాటా మాటా అనుకొన్నారు. కొట్టుకున్నారు. కచేరీ కెక్కారు. చివరికి కొండాలరావు కేసు ఓడిపోయేట్లున్నదని తెలియగానే తిరుపతిరావును ఒకనాడు రాత్రి స్టేషన్ దిగగానే కొట్టి చంపించాడు. చంపినవాళ్ళను పోలీసులు పట్టుకొన్నారు. కేసు నడిచింది. కొండాలరావు ఇంట్లో ఉన్న ధనమంతా ఖర్చుపెట్టాడు. సగానికిపైగా భూములు అమ్మాడు. ఎలాగయితేనేం కేసులో గెలిచాడు. కాని సంవత్సరం తిరక్కముందే అతి నికృష్టపు చావు చచ్చాడు. అందుకే ఇప్పుడు వసంతరావు ఇంట్లో ఏమీ లేదు. బయట ఆ భూములుతప్ప" అని ఆగాడు శాస్త్రి.

"ఎన్నిసార్లు విన్నా మళ్ళీమళ్ళీ వినబుద్ధి అవుతుంది వీళ్ళ కథలు వింటే, అదేం గమ్మత్తో కాని" అన్నాడు శివం.

"ఈ ముత్యాలరావుమాత్రం అబ్బ, రాక్షసుడు గాదండీ" అన్నాడు శాస్త్రి.

గుండుమీద చెట్టుమీది పిట్టవేసిన రెట్టను ఆకుతో తుడిచేసుకొని మళ్ళీ ప్రారంభించాడు శాస్త్రి: "ముత్యాలరావు మేనత్త సుశీలమ్మ భర్త చచ్చిపోగానే, అందరూ లక్షలు అంటారు. అసలు సరిగా తెలియదుగాని, అంత డబ్బు పెట్టుకొని ఇక్కడికి చేరింది. ఆమెభర్త తాలూకు బంధువులు కేసుపెట్టారు సుశీలమ్మమీద. రాత్రికిరాత్రి పీక నులిమి బావిలో పారేసి అది బావిలో పడి చచ్చిపోయిందని చెప్పుకున్నాడు ముత్యాలరావు."

---

## నమ్మిక

ఫలానికి ముందు పుష్పం విచ్చినట్లే, సత్క్రియలకు ముందు నమ్మిక వికసిస్తుంది.

—వాలేరి

---

మధ్యలోనే సుందరం “మరి పీక నలిపి చంపినట్లు ఎలా తెలుసుకొన్నారు” అని అడిగాడు.

“పానకంలో పుడకలా వీడూ, వీని చొప్పదంటు ప్రశ్నలూ. ఆమాత్రం తెలియదురా. బ్రతికిన మనిషి నీళ్ళలో పడి చస్తే కడుపు ఉబ్బుతుంది. శవాన్ని పారేస్తే అలాకాదు. పైగా, శవం తేలిఉంటుంది. బ్రతికిఉన్న మనిషి పడి చస్తే ఒక్క రోజుదాకా శవం తేలదు. సరేగాని చెప్పండి, శాస్త్రిగారూ” అన్నాడు శివం.

ముక్కుపొడుం పట్టించి “ఇంకేముంది, లక్ష్మి ఈయన పాలైంది. అక్కడ వాళ్ళు ఊరుకొన్నారు. శవాన్ని పంచనామా చెయ్యటానికి వచ్చిన ఆ పోలీసు వాళ్ళకు కొంత ముట్టజెప్పాడు. వాళ్ళు ఆమె బావిలో పడి చచ్చిందని వ్రాసిపారేశారు.” కాస్సేపాగి “ఇంకోసారి రజాకార్ల కాలంలో మన ఊరికో ముసలి ముసల్మాను, వాడి బిడ్డా వచ్చారు. మొన్న పెదరంగులు బిడ్డను లేవ దీసుకుపోయిన ఇమాంగాడి తండ్రికి బంధువని చెప్పు కొన్నారు జనం. ఆ ముసలివాడి కూతురిదిమాత్రం ముట్టుకొంటే మైలపడేంత అందం. ఒకనాటి రాత్రి ముత్యాలరావు వాళ్ళ ఇంటికి వెళ్ళాడు. ఆ ముసలివాడు కత్తి తీసుకు పైకి వచ్చాడో ఏమో పొట్టలో పొడిచాడు. తెల్లారేసరికల్లా వాడి కూతురు ఉరిపోసుకు చచ్చి వాసానికి వేలాడుతూ కనిపించింది. అప్పుడు ఎవరు చేసిందీ తెలియలేదుకాని తరవాత, తెలి సింది ఈ ముత్యాలరావేనని” అని ఆగాడు శాస్త్రి. అందరూ కాస్సేపు మౌనంగా ఉండిపోయారు. సుందరం పేకముక్కలను చేతిలోకి తీసుకొని విసురుకొంటున్నాడు.

దూరాన గుడిసెలో వెలిగిన దీపాన్ని చూసి “దీపం జ్యోతిః పరబ్రహ్మ . . .” అని అస్పష్టంగా గొణుగుతూ చేతులెత్తాడు శాస్త్రి.

“శాస్త్రిగారూ, మీరు ప్రతిరోజు రాత్రి మల్లమ్మ గుడిసెలోని దీపానికే మొక్కుతారుగదా, మల్లమ్మ గుడిసెకూ లేక దీపానికీ, మీకూ ఏమైనా. . .” అని అడిగాడు సుందరం నవ్వుతూ.

మసకచీకటిలో రంగులు మారిన శాస్త్రిముఖం మీద స్వేదబిందువులు కనిపించాయి.

“సుందరరావూ, అది అంత క్షేమకరమైన మాట కాదు, నాయనా” అన్నాడు శాస్త్రి, పంచ భుజంమీద వేసుకొని లేస్తూ.

“అంత కోపమా, శాస్త్రిగారూ. కూచోండి. వాడో కొంటెవెధవ. ఏదో పరిహాసానికన్నాడు” అన్నాడు సత్యం.

“పెద్దవాళ్ళతో పరిహాసం పనికిరాదయ్యా, సుందర రావూ. యాదవవంశ మెలా నాశనమైందో తెలుసును గదా” అన్నాడు శాస్త్రి.

“తెలియదు, శాస్త్రిగారూ. ఆ కథేమిటో చెప్పండి” అన్నాడు సుందరం.

అరికాలిమంట నెత్తికెక్కిందేమో శాస్త్రి గంతులు వేస్తూ వెళ్ళిపోయాడు, సత్యం పిలిచినా వినిపించు కోకుండా.

చిన్న కుర్రాడొకడు లాంతరు తీసుకొనివచ్చి బండ మీదపెట్టి “అమ్మ రమ్మంటున్నది నిన్ను” అని వెళ్ళాడు.

“వస్తున్నానని చెప్పు” అని అన్నాడు పెద్దగా శివం.

ముత్యాలరావూ, వెంట రెల్లుగడ్డిలాంటి మనిషీ వెళ్ళిపోయారు. వెనకాలే ఇంకోమనిషి వచ్చాడు.



ఆమె....

చిత్రం—ప్రేమచంద్రగోస్వామి (జయపూరు)

“ఏం భట్రాజా, అంతా బాగేనా?” అని అడిగాడు సుందరం.

నాటకఫక్కీలో ఒక నవ్వు నవ్వి పద్యం చదివి, “ఏకో నారాయణః, నేను బాగుండక పోవటమేమిటండీ” అన్నాడు భట్రాజు.

“ఇక్కడ అయ్యగారున్నారా?” అంటూ ఒక వ్యక్తి వచ్చాడు.

“ఎందుకురా?” అడిగాడు శివం.

“చిన్నదొర తీసుకురమ్మన్నరయ్య” అన్నాడు.

“చిన్నదొర ఇంట్లో ఏమిటిరా?” అడిగాడు భట్రాజు.

శివం చెప్పాడు.

“నీవూ వెళ్ళరాదూ, భట్రాజూ, కాఫీ ఫలహారమో, కోడిపులావో దొరుకుతుంది” అన్నాడు సుందరం.

“మరి వాళ్ళు వచ్చినారురా?” అడిగాడు భట్రాజు.

“ఏదీ రాలేదు” అన్నాడు వాడు.

“అయ్యగారు అప్పుడే వెళ్ళిపోయాడు. వెళ్ళు” అన్నాడు సత్యం.

“నీవూ వెళ్ళరాదూ” అన్నాడు సుందరం.

“తహా, వెళ్ళకుంటే నేనెలా విడిచిపెడతానండీ. అడ్డముక్కో, కారప్పూసో దొరకదా కోడి పులావు కాకున్నా. పైగా వాళ్ళు ఇంకా రాలేదాయె. కాని ఇప్పుడు మీరు ముత్యాలరావును చూశారా?” అని అడిగాడు భట్రాజు.

“రోజూ చూస్తూనేఉన్నాం కదా. విశేషమేమిటి?” అని అడిగాడు శివం.

“విశేషమే ఉంది మరి. ఆయన తలమీద పట్టీ చూశారా?” అన్నాడు భట్రాజు.

“రాత్రి ఏమైనా పాడుపని చేశాడేమో ఎవడో కొట్టిఉంటాడు” అన్నాడు సుందరం.

“మీ కెలా తెలిసిందండి?” అని విస్తుపోయాడు భట్రాజు.

“నిజంగా అంతే జరిగిందా ఏమిటి? నే నేదో ఊరికే అన్నాను” అన్నాడు సుందరం ఆశ్చర్యంతో.

“సరిగ్గా మీరు చెప్పినట్లే అయిందండి శాస్త్రిగా రింట్లో” అన్నాడు భట్రాజు.

“శాస్త్రిగారింట్లోనా?” ముగ్గురూ ఒక్కసారే అడిగారు విస్తుపోతూ.

“నిన్నరాత్రి ముత్యాలరావు శాస్త్రిగారి ఇంటికెళ్ళి కమలమ్మను బలవంతం చేశాట్ట. . .”

“కమలమ్మ ఎవరు? మొన్న శాస్త్రి పెళ్ళాడిన ఆమె పేరా?” అడిగాడు మధ్యలో సుందరం.

‘ఆఁ. ఆఁ. ఆమే. ఆ సమయానికే మంథెన వెళ్ళిన శాస్త్రి రైలు దిగి వచ్చాడట. అక్కడే ఉన్న కర్రతో ముత్యాలరావు నెత్తిమీద పుచ్చుకొన్నాడట. ముత్యాల రావు ఏవేవో మాటలంటూ వెళ్ళిపోయాడట. బయటికి వెళ్ళగా పుల్లయ్య షావుకారు చూశాట్ట. శాస్త్రి బయటికి వచ్చి షావుకారును పిలిచి, జరిగిన సంగతిచెప్పి, తన పరువు గంగపాలు అవుతుందని, ఇంకెవరితోనూ చెప్పవద్దని మాట తీసుకొన్నాడట. పొద్దున నేను షావుకారు ఇంటికి దాయవత్తుకని వెళితే ఈ మాట ఇంకొకరికి తెలువ కూడదంటూ ఈ విషయం చెప్పాడు” అని ముగించాడు భట్రాజు.

“నువ్వు మాకు చెప్తున్నావు. అంతేనా?” అన్నాడు సుందరం. సత్యం నవ్వాడు.

“లేకపోతే వయసుమీరిన శాస్త్రికి అంతఅందమైనా, వయసూ ఉన్న స్త్రీ ఎందుకు చెప్పు?” అడిగాడు శివం.

“అయ్యయ్యో! ఎంతమాట! లోకంమీద భార్యలు చచ్చినవాళ్ళందరూ ఊరికే ఉంటున్నారా. చెప్పండి. అందులో శాస్త్రికి కుచేలసంతానమాయె. ఎవరు చూస్తారు చెప్పండి వాళ్ళను?” అన్నాడు భట్రాజు.

లాంతరు పట్టుకువచ్చిన కుర్రాడు మళ్ళీ వచ్చాడు. శివం లేచినిలుచున్నాడు. భట్రాజూ లేచాడు. కుర్రాడు ముందరా, శివం, భట్రాజు వెనకా వెళ్ళిపోయారు.

“ఇక్కడ అయ్యగారు లేనట్టుంది” అంటూ వచ్చా డొక లావుపాటి మనిషి.

“ఓహో రాముడా? ఎవరు రమ్మన్నారురా?” అడిగాడు సుందరం.


“పెద్దదొర” అన్నాడు రాముడు.

“అదిగో గుడిసె అంటుకొందిరా, సుందరం” అన్నాడు సత్యం.

“అరె, అది మల్లిగుడిసె” అంటూలేచాడు సుందరం.

ముగ్గురూ పరిగెత్తారు. ఊరంతా కదిలింది చిన్నా, పెద్దా, ఆడ, మగ అనే భేదంలేకుండా. శోకాలు, కేకలు, గోల పరిగెత్తుతూనేఉన్నారు జనం బ్రహ్మపుత్ర వరదల్లా. ఇప్పుడక్కడ గుడిసె లేదు. గుడిసెలో దీపం లేదు. బ్రహ్మాండమైన యజ్ఞగుండంలా ఉంది. మంటల వెలుగులో మింటికెగిసే పొగ కనిపిస్తూంది.



ప్రసిద్ధి చెందిన భారత్ వారి పేము కుర్చీలు
ప్రతి ఇంటా, ఆఫీసులో
తప్పక ఉండవలసినవి.



శ్రీ జయభారతం అండ్ కం. (రిజిస్టర్డు)
182, ఆర్. హెచ్. రోడ్డు, మద్రాసు—14.
ముఖ్యమైన అన్ని టౌన్లలోను మాకు
స్టాకిస్టులు కావలెను.
ఉచిత కేటలాగుకు
మీ అడ్రసు స్పష్టముగా వ్రాయండి.



ప్రపంచపు అత్యద్భుతమైన
గృహ సినిమా ప్రొజెక్టర్




మీ అభిమాన ఫిలిం తారలు తెరమీద రంగురంగులతో శృంగారంలో, హాస్యంలో, పోరాటంలో యదార్థజీవితంలోవలె కదలుతూ, నాట్యం చేస్తూండే దృశ్యాలు, వార్తలు సినిమాలలో వలె ఇంట్లో చూచి ఆనందించండి, లేదా సంతలలో, ప్రదర్శనాలలో బ్రహ్మాండంగా డబ్బు గడించండి. ఏసి లేక డిసి లేక బాటరీ టార్చితో నడిపించటానికి సిద్ధంగా సర్వ సంపూర్ణమైనది. సంతృప్తి పూచీ ఇవ్వబడినది. 100 అ.ల. ఉచిత. ఫిలిం 6'×5' తెర, ఇన్‌స్ట్రక్షన్‌తో సూపర్ స్పెషల్ ప్రొజెక్టర్ వెల రు. 45/—లు. పోస్టేజి రు. 5/—లు. అదనపు ఫిలిం రీల్ రు. 10/— లు.

గొప్పగిరాకీ — నేడే ఆర్డరివ్వండి.

**Hollywood Cinema Corporation,**
**3194, Kalyanpura, (AP-1) Delhi-6.**

Pratap|HCC|9168


గోల తక్కువయింది. మంటలు చల్లారాయి. జనం మర్రిచెట్టు దగ్గిర చీలిపోతున్నారు. శివం వచ్చి బండమీద కూచున్నాడు. సత్యం, సుందరమూ వచ్చారు.

"రాలేదేంరా?" అడిగాడు సత్యం.

"అమ్మయ్యో! చచ్చిన మనిషిదగ్గిరికి, కాలిపోతున్న ఇల్లు దగ్గిరికి వెళ్ళటమంటే చచ్చేంత భయం నాకు" అన్నాడు శివం.

"ఇన్నేళ్ళయినా పిరికితనం పోలేదన్నమాట" అన్నాడు సత్యం నవ్వుతూ.

"మనం లాంతరు విషయమే మరిచిపోయాం" అన్నాడు సుందరం.

"మరిచిపోవడమేమిటి, విడిచివెళితేమాత్రం ఉండదా ఇక్కడ?" అన్నాడు సత్యం.

"ఉంటుంది, ఉంటుంది. మీరు అటు వెళ్ళారో లేదో నేను ఇక్కడికి వచ్చాను కాబట్టి సరిపోయిందికాని. లేకపోతే మల్లిగుడిసె పరశురామప్రీతి అయినట్లు ఇది ఎవడి ప్రీతి అవునో?" అన్నాడు శివం.

భరద్వాజ వచ్చాడు.

"శాస్త్రులు ఎక్కడ?" అడిగాడు సుందరం.

"ఎం దు కం టే?" అన్నాడు భరద్వాజ, ఏమయిందన్నట్లు.

"మల్లి కోడలు పెద్దదయింది మంచిదేనా అని అడిగితే, చాలా మంచిరోజు అని అన్నాడు శాస్త్రి. చెప్పి రెండుగంట లయిందో లేదో దాని గుడిసె కాలిపోయింది. ఏమంటావు?" అన్నాడు సుందరం.

"ఈమధ్య మన సుందరంగాడి బుర్ర అమోఘంగా పని చేస్తున్నదిరోయ్" అన్నాడు శివం.

"తెలిస్తే చెప్పాలి. లేకపోతే మానుకోవాలి. పాడు రోజుఅయితే విరుగుడుగా శాంతి చెయ్యటమో, లేక ఇంకేదో ఉంటుంది. ఉంటుందా ఉండదా?" అన్నాడు సుందరం భరద్వాజకేసి తీక్ష్ణంగా చూస్తూ.

భరద్వాజ తేరుకొని "ఉంటుంది" అన్నాడు దీర్ఘమైన శ్వాస విడుస్తూ.

"శాస్త్రులు ఇంకా అక్కడే ఉన్నాడా?" అడిగాడు శివం.

"లేదండి. అప్పుడే వెళ్ళాడు ముత్యాలరావు ఇంటికి. తలారి రాముడిని పంపించారు."

"వాడు అప్పుడు మాతోనే పరిగెత్తుకువచ్చాడు గదా మల్లిగుడిసెదగ్గిరికి?" అన్నాడు సుందరం.

"కావచ్చు" అన్నాడు భరద్వాజ.

"శాస్త్రి కసలు బుద్ధి లేదు. నిన్న రాత్రేకదా అలా జరిగిందన్నావు? మళ్ళీ వాడింటికి వెళితే ఎలా?" అన్నాడు సుందరం.

"అయ్యయ్యో! అలాగని భీష్మించుకు ఇంట్లో కూర్చుంటే పొట్ట ఎలా గడుస్తుంది చెప్పండి? పేదవాడి కోపం పెదవికి చేటన్నారు. రాత్రి విషయమంటారా ఇక? దాని కదే. మాటకు మాటే ఉండాలి. దీనినే గడుటండి లౌక్యం అంటారు" అన్నాడు భరద్వాజ.

"ఇంతకీ ఏమయింది? వాళ్ళకు పిల్ల నచ్చిందా?" అని అడిగాడు సత్యం.

"పిల్ల నచ్చుట మెక్కడిదండి. అసలు వాళ్ళు రానే లేదు. నేను వెళ్ళిన తరవాత కాస్సేపు పిచ్చాపాటీ మాట్లాడుకొని సంహారం చేశాము. తరవాత శాస్త్రి అటువేపు వెళ్ళాడు. పోకచెక్కలు పొట్లో వేసుకొని నేనూ బయటపడ్డాను" అన్నాడు భరద్వాజ.

"అయితే రాముడు గుడిసె కాలిపోయిన సంగతి చెప్ప లేదన్నమాట వసంతరావు ఇంట్లో?" అడిగాడు సత్యం.

"లేదు" అన్నాడు భరద్వాజ.

శివం చదరంగం అట్ట, పావులు తీసుకువచ్చాడు క్లబ్బునుండి.

శివం, భరద్వాజ చదరంగం ఆడుతున్నారు. సుందరం డిటెక్టివ్ నవల చదవసాగాడు. సత్యం మధ్య మధ్య ముగ్గురినీ మాట్లాడిస్తున్నాడు.

శాస్త్రి వచ్చి మెల్లగా శివంపక్కన కూచున్నాడు. శివం, సుందరం రామబాణాల్లా ఎన్నో ప్రశ్నలు అడిగారు, మాటలన్నారు శాస్త్రిని. విసుగుచెందని విక్రమార్కుడిలా సమాధానాలు చెప్పాడు శాస్త్రి. మధ్యలోనే శివం లేచి సుందరంపక్కన కూచొని పేకముక్కలు కలిపాడు. శాస్త్రి, భరద్వాజ చదరంగంలో లీనమైపోయారు.

కమ్యూనిటీరేడియో వాగుతూంది. గొంతు చించుకొని పాడుతూంది. కాని వినే నాథు డెవ్వడూ లేడు.

"పది అయినట్టుంది, వెళదాం ఇంటికి" అన్నాడు సత్యం. శివం పేకముక్కల్ని తీసికొని క్లబ్బులోకి వెళ్ళి రేడియో ఆపుచేశాడు.

ఎక్కడో గుడ్లగూబ అరిచింది.

సుందరం చదరంగంఅట్ట తీసేస్తానన్నాడు. "కాస్సే పాగండి అయిపోతుంది" అన్నాడు భరద్వాజ.

కబ్బు పక్కఇంట్లోనుండి భారతంలోని పద్యాలు చదువుతున్న ముసలిగొంతు వినవస్తూంది.

భరద్వాజ షా అనటము, "అబ్బ! కడుపులో పోటు" అంటూ శాస్త్రి కడుపు చేత్తోపట్టుకొని కింద పడిపోవటము ఒక్కసారే జరిగాయి. సుందరం శాస్త్రి భుజాలను పట్టుకొని పైకి లేవదీశాడు. 'అమ్మా!' అని మూలిగాడు శాస్త్రి. భరద్వాజ నాలుగయిదుసార్లు శాస్త్రిని పిలిచాడు. శాస్త్రి నోటినుండి అస్పష్టంగా "రా. ..మ. . . రా. . .మ. . .' 'శబ్దం వినవచ్చింది. శాస్త్రిచేతిని తన చేతిలోకి తీసుకొని సుందరాన్ని విడిచి పెట్టమన్నాడు భరద్వాజ. "నాడి కొట్టుకోవటం ఆగి పోయింది" అంటూ తానూ లేచాడు భరద్వాజ.

క్లబ్బునుండి పరిగెత్తుకువచ్చిన శివం—చచ్చినమనిషినే చూస్తే హడలిపోయే శివం, సత్యం, సుందరం విస్తుపోయి చూస్తున్నారు శాశ్వతనిద్రలో ఉన్న శాస్త్రిని.

"గుండె ఆగి చచ్చిపోయే మరణాలు ఈ కాలంలో ఎక్కువండీ. మనమూ ఎప్పుడు పోయేది తెలియదు" అన్నాడు భరద్వాజ వేదాంతధోరణిలో.

"ఇంతసేపూ బ్రతికిఉన్న శాస్త్రి ఇప్పుడిప్పుడే చచ్చాడంటే చూస్తూకూడా నమ్మలేకుండా ఉన్నాను" అన్నాడు సత్యం.

"ఇటువంటిఅదృష్టపుచావులు ఎందరికివస్తాయండి. రామనామం జపిస్తూ చచ్చిపోయాడు. పుణ్యలోకానికి వెళతాడు" అన్నాడు భరద్వాజ.

"శాస్త్రి వాచీ అద్దం పగిలిపోయింది" అన్నాడు సుందరం.

"మనిషి చనిపోయినప్పుడు వాచీ ఉండి ఏం చేస్తుంది?" అన్నాడు ముఖంలో కళలేని శివం.

(తరువాయి 58 వ పేజీలో)

పోయాయి. విశ్వమూర్తి ప్రతినెలా డబ్బై అయిదు రూపాయలదాకా పంపుతూనే ఉన్నాడు. అవి తమకి సరిపోతున్నాయి. తనకి వచ్చే రెండువందల ఇరవై రూపాయల్లోనూ నూటఇరవై దాకా కృష్ణకి పంపి మిగతాది బాంకిలో వేస్తున్నది. రజనికూడా ఎక్కి వస్తూంది. దాని అవసరాలుకూడా తక్కువైనవేమీ కాదు. అది ఏమి చదువుతానంటుందో. మోహన్ ఉన్నాడు వాడికేమీ ఫర్వాలేదు. వాడు పై చదువులకి వచ్చేసరికి కృష్ణ ఏదో సంపాదనలో ఉంటాడు. అంత కష్టం ఉండదు. అతడూ బాధ్యత తెలిసినవాడే. ఆ చదువు పూర్తిచేస్తే సరళ కొంత స్థిమిత పడవచ్చు.

సరళకి దసరా సెలవులు వచ్చాయి. రేపు సెలవు ప్రారంభం. ఇంటికి పోవడానికి అన్నీ సర్దుకుంది. భోజనంచేసి పడుకుంది. బయట వర్షం జల్లుజల్లుగా కురుస్తూంది. ఉండి ఉండి కుండపోతగా గుమ్మరించి పోతూంది. వాతావరణం చలి చలిగా సరాలకి గిలిగిలిగా ఉంది. ఇటువంటి సమయంలో సరళ మంచంమీద గుండెలవరకు దుప్పటి లాక్కొని పడుకుంది. ఏవో ఏవో ఆలోచనలు. తన కాపురపు మొదటి రోజులు, అప్పటి సంకీర్ణసుఖమయమధురక్షణాలు జ్ఞాపకం వస్తున్నాయి. ఎదురుగా ఉన్న భర్తయందు నిమగ్నమైపోయింది ఆమె మనస్సు ఒక్కసారిగా. భర్త తనని బాహువుల్లో ఇమిడ్చి గుండెల కదుముకుంటున్నాడు. తాను వివశ అయి అతని భుజంమీద వాలిపోయింది. అతడు చేస్తున్న కొంటెచేష్టలకి తాను సంతోషంతో సిగ్గుపడి పోతూంది. అతడు తన చెవిలో ఏదో గునగున లాడుతున్నాడు. "సరళా! ఇలా బాహ్యంగా నీకు ఇతరంగా ఉన్న ఈ తనువుమీద నాకు విసుగెత్తుతూంది. నీ పెదవులచాటున దాచుకున్న పినశాలలో నిరంతరం ఉండిపోవాలంటే ఏం చెయ్యను? నీ ప్రణయపుటూహలోని మాధురీ స్రవంతిగా పర్యవసించాలంటే ఏం చెయ్యను?" అంటున్నాడు. తనర్ధనదంతా అతని స్పర్శతో పరవశించిపోయింది. తన మదిలోని బరువంతా చేత్తో తీసినట్లు తేలిక పడింది. ఆ స్థితిలో ఆలోచనలు లేవు. ఉద్వేగాలు లేవు. కాని సరళకు ఇది నమ్మబుద్ధిగా లేదు. 'ఇది ఎలా సంభవం?' అనుకుంది. తనని తాను గిల్లుకుంది. త్వగింద్రియం స్పర్శజ్ఞానాన్ని పోగొట్టుకొనలేదు. వర్షపుజోరు దూరంగా నెమ్మదిగా తనకి తెలుస్తూనే ఉంది. తన హృదయం మాత్రం భర్తసాన్నిధ్యసుఖాన్ని పొంది శరీరాన్ని తేలిక పరుస్తూంది. ఇది ఒక వింతైన అనుభవం. కలగాదు. మెలకువ గాదు. ధ్యాననిష్ఠమైన అవస్థలో కలిగే ఒక అనుభూతి. సరళ కళ్ళు తెరిచేసరికి తాను ఒంటరిగా గుంటూరులో తన పుట్టింట్లో తన స్టడీరూములో మంచంమీద ఉంది. కాని ఆ అనుభూతితాలూకు సుఖం తనని వదిలిపెట్టలేదు. ఆమె శరీరం ఒక ధారావినిర్ముక్త మేఘశకలంవలె పుష్పవనంమీది గాలి తరగవలె తేలిపోతూంది. ఈ విచిత్రం ఆమెకి విస్మయం కలిగించింది.

(సశేషం)

# సంభవామి యుగే యుగే

(12 వ పేజీ తరువాయి)

క్షణాలమీద వార్త ఊరంతా పాకింది. తెల్లగుడ్డలు వేసుకొన్న దొరలు, జనం గుమిగూడారు. చావడిలోని బిచ్చగాడూ వచ్చాడు "నన్ను తీసుకుపోయినా బాగుండును" అంటూ. ముత్యాలరావు వచ్చాడు. వెంట తెల్లగడ్డమనిషి ఉన్నాడు. శవాన్ని దహనం చెయ్యటానికి వీలులేదన్నాడు. పంచనామా చేయించాలన్నాడు. శవం మీదపడి భోరుమంటున్న స్త్రీతోపాటు చుట్టూఉన్న జనంలోని ఆడవాళ్ళు కళ్ళనీరు తీసుకోవడం ప్రారంభించారు.

తెల్లారేసరికల్లా పోలీసుఇన్స్పెక్టరూ, ఇద్దరు జవాన్లూ దిగారు మర్రిచెట్టుదగ్గర, ఎడ్లబండిలోంచి. ఇన్స్పెక్టరు వస్తూనే ముత్యాలరావుకు నమస్కారం చేశాడు. సత్యం, సుందరం, శివం, భట్రాజుల నడిగి రిపోర్టు వ్రాసుకున్నాడు ఇన్స్పెక్టరు.

"నిన్న సాయంకాలం బాగున్నాడండీ మనిషి. ఇంత హఠాత్తుగా చావటమంటే నా కేదో అనుమానంగా ఉంది" అన్నాడు ముత్యాలరావు.

"మీ కెవరిమీదనైనా అనుమానముందా?" అని అడిగాడు ఇన్స్పెక్టరు ఏడ్చి ఏడ్చి రాత్రిఅంతా నిద్రలేక వాచిఉన్న కళ్ళస్త్రీ కమలమ్మను.

ఎవరిమీదా అనుమానము లేదంది. వెంటనే తనకు తెలియదన్నది. కోసి చూడాలన్నాడు ముత్యాలరావు. ఆ పనిమాత్రం చెయ్యవద్దని భోరుమన్నది కమలమ్మ. ముత్యాలరావు ఇన్స్పెక్టరుతో ఏదో చెప్పాడు.

మధ్యాహ్నం పోలీసుఇన్స్పెక్టరూ, జవాన్లూ సవారి బండిలో, శాస్త్రిశవం పెద్దబండిలో వెళ్ళిపోయారు.

* * * *

ఆనాడు దూదిపింజలుకాదు, కారుమేఘా లావరించాయి ఆ ఊరిమీద. సత్యం, శివం మర్రిచెట్టు కింద కూచున్నారు. కొద్దిదూరంలో సుందరం తెరిచిన డిటెక్టివ్ నవలను చేత్తో పట్టుకొని మేఘాలకేసి చూస్తూ ఏదో ఆలోచిస్తున్నాడు.

"అయితే వసంతరావుకు ఇరవైఏళ్ళ జైలుశిక్ష వేస్తారంటావా?" అడిగాడు సత్యం.

"వాడు తలుచుకొన్న తరవాత విడిచిపెడతాడా, మరి? ఛీ! ఛీ! ఎంత అన్యాయం?" అన్నాడు శివం.

"ఆనాడు శాస్త్రిలోకలిసి వసంతరావుఇంట్లో ఫలహారమో పప్పన్నమో తిన్న భట్రాజు సాక్ష ఉంటే వసంతరావుకు జైలుశిక్ష తప్పుతుంది. ముత్యాలరావుకు ఉరిశిక్ష వేస్తారు" అన్నాడు డిటెక్టివ్ నవల పక్కన పారేసి సుందరం.

"అహా! నీ డిటెక్టివ్ తెలివికి సంతోషించామురా, ఆ ముత్యాలరావుమాత్రం అంత తెలివితక్కువ దద్దమ్మ అనుకొన్నావా? ఆనాటి సాయంకాలమే రెండు మూడువేల రూపాయలు చేతికిచ్చి కాశీకి టికెట్టు కొని భట్రాజును ఇక్కడినుండి పంపించాడు కదా" అన్నాడు శివం.

"నీ కెవరు చెప్పార్రా ఇది?" ఆశ్చర్యంగా అడిగాడు సుందరం.

"ఇలాంటి సంగతులు వాటంతట అవే తెలుస్తాయి కాని, పాపం! ఎంత ఘోరం జరిగిపోయింది! ఆ"! అంటూ నిట్టూర్చాడు శివం.

టపటప చినుకులు రాలాయి.

"అంత గయ్యాళిఅయినా కాంతమ్మ దుఃఖాన్ని ఇప్పుడు చూస్తూంటే కడుపు తరుక్కుపోతున్నదిరా" అన్నాడు సత్యం.

వర్షం జోరు హెచ్చింది. ముగ్గురూ యూత్ క్లబ్బులోకి పరిగెత్తారు. తప్పిపోయిన ఒంటికాకి కావు కావుమంటూ మర్రిచెట్టుమీదుగా ఎగిరి కొన్ని ఇళ్ళు దాటి వేపచెట్టుమీద వాలింది. వీధిచివరినుండి రెయిన్ కోటొకటి ఇటువేపు వస్తూంది. వేపచెట్టు కెదురుగా వీధి కవతలివైపుఉన్న ఇంటిముందు ఆగి తలుపు తట్టింది రెయిన్కోటు. తలుపు తెరుచుకొంది కొద్ది క్షణాలకు. తళుక్కున మెరిసింది మేఘం. ఎదురుగా బోడితల మీదుగా కప్పుకొన్న తెల్లచీరలో ఆడమనిషి కనిపించింది. "శా. . . స్త్రు. . . లు. . . భా. . . ర్య. . ." వినీ విన బడనట్లు గొణిగింది రెయిన్కోటు. తలుపులు దభాలున మూసుకొన్నాయి. రెయిన్కోటు వెనక్కి తిరిగి కాస్సేపాగి, ముందుకు అడుగులు వేసింది. అంతా చీకటిమయం. అప్పుడప్పుడు మెరుపుకాంతిలో వీధి, సెలయేరులా పారుతున్న నీరూ కనిపిస్తున్నాయి. మొండితోక కుక్క రెయిన్కోటును దాటేసి చావడిలో దూరింది. మర్రిచెట్టు దాటి పోయింది రెయిన్కోటు. కళ్ళు జిగేలుమనేట్టుగా మేఘాల్లో తళుక్కున మెరిసింది. చావడిలో చాలీచాలని బట్టలో గజగజ వణుకుతున్న బిచ్చగాడు తన పక్కనే వచ్చి కూర్చున్న కుక్కను కర్రతో కొట్టాడు. కుక్క కయ్యిమంటూ లేచి వర్షంలోనే రెయిన్కోటు వెళ్ళిన దిక్కు పరిగెత్తింది. కమ్యూనిటీ రేడియో "ఈ వేళ తెలంగాణా జిల్లాలలో వాతావరణం పొడిగానే ఉండవచ్చు" అని చెప్పుతూంది. ఇంతలో మిన్ను విరిగి మీద పడ్డట్టు ఫెళఫెళమని ఉరిమింది మేఘం. "నన్ను తీసుకుపోయినా బాగుండును" అన్న బిచ్చగాడు తన మీద పిడుగు పడవద్దనేమో, "అర్జునా, ఫల్గుణా..." అంటున్నాడు. యూత్ క్లబ్బు బోర్డు విరిగి కింద పడింది. క్లబ్బు పక్కఇంట్లోనుండి "పరిత్రాణాయ సాధూనాం. . ." అన్న గీతాశ్లోకం వినవస్తూంది.

అవతలి వీధిలోనుండి "ముచ్చార్లావుదొర, పిడుగు" అన్న గావుకేక వినవచ్చింది. యూత్ క్లబ్బునుండి బయటికి వచ్చి చావుకేక వినిపించిన చోటికి పరిగెత్తారు సత్యం, శివం, సుందరం. ★

## గమనిక

మామూలుగా ప్రచురణకు రచనలు ఎడిటర్, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, ఎక్స్ప్రెస్ ఎస్టేట్స్, మద్రాసు—2' కు పంపవలసి ఉన్నది. పోటీలకు అయితే కవరుమీద పోటి పేరు స్పష్టంగా వ్రాయాలి.